క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

కోటనందూరు: స్థానిక తాండవ నదిపై రూ.10 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేసి బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, ఉల్లూరి శ్రీను, మళ్ల రవి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ప్రయాణికులు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ 73827 81490 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియపరచాలని సూచించారు.

అరుణాచలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అరుణాచలేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పండితులు తెల్లవారుజామున స్వామివారికి సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మద్రాసుకు చెందిన టూరిస్టులు, భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

జగ్గంపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ అన్నారు. మండలంలోని రాజపూడి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులతో పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ వసంత కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి 'ఉమ్మిడి' రాజీనామా


ఉమ్మిడి వెంకట్రావు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ప్రత్తిపాడులో సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను 2004 నుంచి 2024 వరకూ 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పనిచేశానన్నారు. పార్టీలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా, పీసీసీ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ కిసాన్ సెల్ కో ఆర్డినేటర్‌గా పదవులను చేపట్టానన్నారు. వ్యక్తిగత కారణాలతో పార్టీ పదవులకు, క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు తెలిపారు. తన రాజీనామా లేఖను ఇప్పటికే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, డీసీసీ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావులకు అందజేసినట్టు ఉమ్మిడి వెంకట్రావు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఏఆర్ ఆసుపత్రిలో వైద్యుడు కె.వరప్రసాద్,ఫార్మసిస్టు అలమండ వీరరాఘవస్వామి, ఫిజియోథెరపిస్టు తనూజనాయుడు పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు సుమారు 50 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్స నిమిత్తం పది మందిని రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. అలమండ దుర్గావెంకటప్రసాద్, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు, కందుల ప్రభాకరరావు, వైద్యులు సింధూర, జయదీప్ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలవండి

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- కేపీ మల్లవరంలో విశ్రాంతి భవనం ప్రారంభం


కేపీ మల్లవరంలో విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా


శృంగవృక్షంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కోరారు. మండలంలోని కేపీ మల్లవరంలో గ్రామ సర్పంచ్ వేముల సత్యవేణి సొంత నిధులు రూ.7 లక్షలతో తన మామ వేముల నూకరాజు జ్ఞాపకార్థం నిర్మించిన విశ్రాంత భవనాన్ని సోమవారం మంత్రి రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడి వేముల రాజబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి రాజా ప్రసంగించారు. గతంలో చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చారని, అధికారం చేపట్టిన తరువాత ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. మహిళల డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, తాకట్టు పెట్టిన బంగారం విడిపించి ఇస్తానని, రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పి ఒక్క హామీని కూడా అమలు చేయకుండా దగా చేశారన్నారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల రావడంతో అదే మోసపూరిత హామీలతో టీడీపీ నేతలు మీ ముందుకు వస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను మళ్లీ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏఎబీ మండల చైర్మన్ సుర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలే లక్ష్యం

తొండంగి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తొండంగి మండలం శృంగవృక్షంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకే పథకాలు అందించి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీడీఓ పసుపులేటి సతీష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు దడాల విజయ్, ఆరుమిల్లి ఏసుబాబు, ఎలిశెట్టి గిరి, బస్సా గంగ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ధూళిపూడి ఆంజనేయులు, సర్పంచ్ ధారా అప్పన్న, ఎంపీటీసీ అడపా సూర్యచక్రం, మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- రమణయ్యపేటలో గడప గడపకూ ..


రమణయ్యపేటలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని రమణయ్యపేటలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్నివర్గాలకూ సమన్యాయం జరిగిందన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. మహిళలకు అనేక పథకాలు ద్వారా లక్షలాది రూపాయిల లబ్ధి చేకూరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రమేష్ రాజు, పడాల అప్పారావుదొర, పట్టా సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్, నైనాలశెట్టి బాబ్జీ, గుమ్ములూరి వెంకటరమణ, బేరి అరవిందకుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై గరంగరం

- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అలమండ సత్యవతి

ఏలేశ్వరం: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అధికారుల తీరుపై కౌన్సిలర్లు గళమెత్తారు. నిధుల కేటాయింపుపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఉండడం లేదని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని కౌన్సిలర్లు మండిపడ్డారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు మాట్లాడుతూ ఇటీవల జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్ల నిమిత్తం కౌన్సిల్ రూ.90 వేలు కేటాయించిందన్నారు. ఈ నిధులతో భక్తులకు కనీసం తాగడానికి నీరు అందించలేదని ఆరోపించారు. నిధుల కేటాయింపుపై ఉన్న శ్రద్ధ ఏర్పాట్లపై లేదని ఆరోపించారు. వేలం పాట నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను కోరారు. 15వ వార్డు కౌన్సిలర్ సుంకర హైమావతి మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. వార్డుల్లో పారిశుధ్య ట్రాక్టర్లు తిరుగుతున్నా పారిశుధ్యం మెరుగులో మార్పులేదన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ కె.శివప్రసాద్, వైస్‌చైర్ పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సుపరిపాలనకు మరో అవకాశం ఇవ్వండి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- తునిలో ఎన్నికల ప్రచారం

తుని: ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు, యువ నేత దాడిశెట్టి శంకర్ మల్లిక్ కోరారు. పట్టణంలోని 12వ వార్డులోని ఏటోడ్డు వీధి, నక్కిన వీధి, రావాడ వీధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి సోమవారం శంకర్ మల్లిక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అల్లాడ దివాణం, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్ బుడ్డిగ దారేష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మేము సిద్ధం-మా బూత్ సిద్ధం


గోనేడలో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు


మల్లిసాలలో మేము సిద్ధం- మా బూత్ సిద్ధం అంటూ నినాదాలు చేస్తున్న నేతలు


కోటనందూరులో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

కిర్లంపూడి: మండలంలోని గోనేడ, తామరాడ, పాలెం గ్రామాల్లోని సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు మేము సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. మండల సచివాలయాల కన్వీనర్ జోకా శ్రీను ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎన్నికలకు సిద్ధమంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జోకా శ్రీను మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని, కాకినాడ పార్లమెంట్ సభ్యుడిగా చలమలశెట్టి సునీల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట అయ్యన్న, అడబాల సుబ్బారాయుడు, పెద్దిరెడ్డి లక్ష్మణ్, పలికల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలోని మల్లిసాలలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు మేము సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేత నేతగట్టి సతీష్ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మేము సిద్ధం- మా బూత్ సిద్ధం అంటూ నినాదాలు చేశారు.

కోటనందూరు: గ్రామంలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, దార్ల సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ



గోకవరం సభలో మాట్లాడుతున్న తోట నరసింహం


గండేపల్లిలో మహిళలకు చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న తోట నరసింహం

గోకవరం: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నాల్గో విడత వైఎస్సార్ చేయూత కార్యక్రమం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని 3860 మంది మహిళా సంఘాల సభ్యులకు రూ.7.45 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మహిళా పక్షపాతి అన్నారు. మహిళల కోసం అనేక పథకాలు అమలు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో యువ నేత తోట రాంజీ, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు పాటి శివకుమార్, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, నాయకులు సుంకర వీరబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, సమ్మెటి నాని, నరాలశెట్టి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లిలో...

గండేపల్లి: రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నాల్గో విడత వైఎస్సార్ చేయూత కార్యక్రమం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు రూ. 5.88 కోట్ల విలువైన నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గ్రామ సర్పంచ్ రుత్తల లలిత, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, సర్పంచులు పోకల సుబ్బు, ములంపాక సురేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు


లింగంపర్తిలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- లింగంపర్తిలో ఇళ్ల పట్టాల పంపిణీ

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేసినట్టు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు తెలిపారు. మండలంలోని లింగంపర్తిలో పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం ఆయన రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ప్రజాదరణ

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీకి అన్నివర్గాల ప్రజాదరణ ఉందని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. లింగంపర్తిలో సోమవారం సిరిపురం గ్రామానికి చెందిన 100 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారికి వరుపుల సుబ్బారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీనేతలు అడపా పార్థసారథి, మజ్జూరి సూర్యనారాయణ, పీతల నూకరాజు, సాదే లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలు ప్రారంభం


వి.వెంకటాపురంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: మండలంలోని శంఖవరం, వి.వెంకటాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రెండు అంగన్‌వాడీ భవనాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సోమవారం ప్రారంభించారు. రెండో విడత నాడు-నేడు నిధులు రూ.31 లక్షలతో ఈ నూతన భవనాలు నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వారికి సకాలంలో పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, సూపర్ వైజర్ అరుణాశ్రీ, సర్పంచులు బైరా ఉప్పారావు, బందిలి గనియమ్మ, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, కొండమూరి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాల సేకరణ కేంద్రం ప్రారంభం

జగ్గంపేట: గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న పాల సేకరణ కేంద్రాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు ప్రారంభించారు. పాడి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు గఫూర్, వైఎస్సార్ సీపీ నేతలు జగాల్, గణపతి, కాపారపు ప్రసాద్, జల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలుద్దాం


సుబ్బయమ్మపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తోట వాణి, శ్రీనిధి

గండేపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగనన్నకు వచ్చే ఎన్నికల్లో అండగా నిలుద్దామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సతీమణి వాణి పిలుపునిచ్చారు. మండలంలోని సుబ్బయమ్మపేటలో సోమవారం ఆమె కోడలు శ్రీనిధితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, గ్రామ సర్పంచ్ బొబ్బర శివ పాల్గొన్నారు.

ముద్రగడకు ప్రజల మద్దతు


కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభానికి మద్దతు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభానికి ప్రజల మద్దతు ఘననీయంగా పెరుగుతోంది. స్థానిక, ఇతర జిల్లాల నుంచి పలువురు కాపు నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ముద్రగడ అభిమానులు సోమవారం కిర్లంపూడిలోని ఆయన నివాసానికి తరలివచ్చి మద్దతు తెలిపారు. పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ముద్రగడను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో గణేశుల రాంబాబు, గౌతు స్వామి, గాబు గంగాధర్, గాబు కృష్ణ, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి ఆర్‌ఓ ప్లాంట్ బహూకరణ


రౌతులపూడి సీహెచ్‌సీకి ఆర్‌ఓ ప్లాంట్‌ను అందిస్తున్న కార్మికులు

రౌతులపూడి: స్థానిక సీహెచ్‌సీకి గ్రామానికి చెందిన పలువురు కాంక్రీట్ కార్మికులు ఆర్‌ఓ ప్లాంట్‌ను బహూకరించారు. సీహెచ్‌సీలో రోగుల దాహార్తిని తీర్చేందుకు కార్మికులు పంపనబోయిన శ్రీను, పంపనబోయిన గోవిందు తదితరులు రూ.2 లక్షల విలువ చేసే ఆర్‌ఓ ప్లాంట్‌ను సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జానకీదేవి మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం కార్మికులు ఆర్‌ఓ ప్లాంట్‌ను బహూకరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కేదారిశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలో మహిళలకు సోమవారం ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. స్థానిక లింగంపర్తి రోడ్డులోని భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన సుమారు 15 మంది లబ్ధిదారులకు బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద మహిళలకు ఉజ్వల పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందజేస్తుందన్నారు. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'కర్నాకుల'


కర్నాకుల వీరాంజనేయులు

కిర్లంపూడి: ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కర్నాకుల వీరాంజనేయులు రెండోసారి ఎన్నికయ్యారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన రైతు కూలీ సంఘ వార్షికోత్సవంలో తనను రెండోసారి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వల్లూరి రాజబాబు ఎన్నికయ్యారని చెప్పారు. నూతన కార్యవర్గ సభ్యులను సంఘ నాయకులు అభినందించారు.